అప్రకటిత కోత.. తప్పని వ్యథ

- విద్యుత్ కోతలతో ప్రజలు, రైతులు సతమతం
- గంటల తరబడి అనధికారిక కోతలతో అవస్థలు
- మంత్రి ఇలాకాలో విద్యుత్ శాఖ అధికారుల ఇష్టారాజ్యం



కరెంట్ సరఫరా లేకపోవడంతో లాంతరు వెలుగులో చదువుకుంటున్న చిన్నారులు



అంబేడ్కర్ నగర్‌లో కరెంట్ లేక క్యాండిల్ వెలుగులో వ్యాపారం చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండలో ఎడాపెడా విద్యుత్ కోతలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోజూ 5 నుంచి 6 గంటల పాటు అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారు. ఓ వైపు మండే ఎండలు.. మరోవైపు కరెంటు కోతలతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. విద్యుత్ ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు సరఫరా ఆగిపోతుందో చెప్పలేని పరిస్థితి. పగటి పూట ఒక్కటే కాకుండా అధికారులు రాత్రి సమయాల్లో కుడా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ఒక వైపు ఉక్కపోత, మరో వైపు దోమల బెడదతో రాత్రంతా జాగరణ చేయాల్సిన పరిస్థితి.

సాకులు చూపి కరెంటు తీసేస్తున్నారు..

ఉరవకొండ మండలంలో చిన్నపాటి ఉరుములు, గాలీవాన వచ్చినా వెంటనే అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఆతరువాత కరెంట్ నాలుగైదు గంటలైనా సరఫరా చేసే పరిస్థితి ఉండదు. ప్రజలు కరెంట్ కోతలపై అనేక మార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, మెయిన్ లైన్‌లో కరెంట్ విద్యుత్ తీగలు తెగిపడ్డాయి అని ఏదో ఒక కారణం చెప్పడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

చిన్న పరిశ్రమలకు కరెంట్ షాక్..

ఉరవకొండ వెల్డింగ్, కుట్టుమిషన్, కార్పెంటర్‌తో పాటు పలు వ్యాపారాలు చేసే చిన్న పరిశ్రమలకు అప్రకటిత విద్యుత్ కోతలు షాక్‌ను ఇస్తున్నాయి. పగటి పూట నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉంటే తప్ప పనులు జరుగుతాయి. అదే పగటి పూటే గంటల తరబడి కరెంట్ కోత విధిస్తుండటంతో చిన్న పరిశ్రమల నిర్వాహకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఉరవకొండ మండలంలో విద్యుత్ కనెక్షన్ల వివరాలు:

సంఖ్య	వివరాలు
15,500	గృహ విద్యుత్ కనెక్షన్లు
2,450	వాణిజ్య కనెక్షన్లు
140	చిన్నపరిశ్రమల కనెక్షన్లు
480	ప్రభుత్వ కార్యాలయాల కనెక్షన్లు
4,418	వ్యవసాయ కనెక్షన్లు
22,988	మొత్తం విద్యుత్ కనెక్షన్లు

అన్ని వర్గాల వారికీ ఇబ్బందులు



రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఉన్న ఉరవకొండలో ఎక్కడా లేని విధంగా కరెంట్ కోతలు పెరిగిపోయాయి. ఎడాపెడా కోతలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల అన్ని వర్గాల వారు ఇబ్బందులు పడుతున్నారు. – నిర్మలా, ఉరవకొండ

ప్రజలు అవస్థలు పడుతున్నారు..



ఉరవకొండలో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కోతలు లేకుండా చర్యలు చేపట్టాలి. దీనిపై మంత్రి దృష్టి సారించి విద్యుత్‌శాఖ అధికారులకు కోతలు లేకుండా ఆదేశాలు ఇవ్వాలి. – ఈడిగ ప్రసాద్ వైస్ ఎంపీపీ, ఉరవకొండ

కోతల్లేని విద్యుత్ సరఫరా చేస్తాం

సాంకేతిక సమస్యలతో కరెంట్ కోతలు ఉంటున్నాయి. వీటిని అధికమించి కరెంట్ కోతలు లేకుండా చర్యలు తీసుకుంటాం. వ్యవసాయానికి కరెంట్ కోతలు లేకుండా చేశాం. ప్రస్తుతం గృహాలు, ఇతర చిన్న పరిశ్రమలకు కూడా కరెంట్ కోతలు లేకుండా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం. – భాస్కర్, విద్యుత్ శాఖ ఏడీఈ

క్లుప్తంగా

మొక్కజొన్న పంట పరిశీలన



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

కణేకల్లు: మండలంలోని పుల్లంపల్లి, పూలచెర్ల, కణేకల్లుక్రాస్ తదితర గ్రామాల్లో గాలీవాన బీభత్సానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంటను గురువారం ఏఓ శ్రవణ్‌కుమార్ పరిశీలించారు. ఎంపీఈఓలు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లతో కలిసి పొలాల్లోకెళ్లి నేలకొరిగిన పంటలను పరిశీలించారు. చాలా చోట్ల 70 రోజుల పంట దెబ్బతిందని ఆయన తెలిపారు. ప్రాథమిక సమచారం మేరకు 48 హెక్టార్లలో మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు చెప్పారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు అకౌంట్ జిరాక్సులు సిబ్బందికి ఇవ్వాలని సూచించారు.

ఉమ్రాయాత్ర పవిత్రమైనది



ఉమ్రా యాత్రికులతో కలిసి దువా పఠిస్తున్న ప్రభుత్వ ఖాజీ సైపుల్లా

రాయదుర్గంటౌన్: మక్కా, మదీనా యాత్ర (ఉమ్రా) ఎంతో పవిత్రమైనదిగా ప్రభుత్వ ఖాజీ మహమ్మద్ సైపుల్లా తెలిపారు. హరమైన్ ఇంటర్నేషనల్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో పట్టణం నుంచి గురువారం 32 మంది యాత్రికులు పవిత్ర ఉమ్రాకు బయల్దేరి వెళ్లారు. ఖాజీ సైపుల్లా దువా పఠించారు. గురువారం రాత్రి బెంగళూరు నుంచి ఫ్లైట్‌లో సౌదీ అరేబియాలోని జద్దా నగరానికి చేరుకొని అక్కడి నుంచి యాత్ర మొదలవుతుందన్నారు.

బాలుడి అప్పగింత



పీరాసాబ్‌ను తండ్రికి అప్పగిస్తున్న ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు

ఉరవకొండ: తప్పిపోయిన బాలుడిని అతని తండ్రికి ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు గురువారం అప్పగించారు. ఉరవకొండ బస్టాండ్‌లో వజ్రకరూరుకు చెందిన మహబూబ్‌బాషా కుటుంబ సభ్యులతో కలిసి ఉరవకొండ నుంచి వజ్రకరూరుకు వెళ్తుండగా అతని కుమారుడు పీరాసాబ్ బస్టాండ్‌లో తప్పిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఆర్టీసీ సిబ్బందికి చిన్నారని తప్పిపోయిన విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ జనార్దన్ నాయుడు, సిబ్బంది చిన్నారిని గుర్తించి అతని తండ్రికి అప్పగించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు నివాళి



హనుమంతప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

శెట్టూరు: మండలంలోని మాలేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కురుబ హనుమంతప్ప (78) అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు మాదినేని ఉమామహేశ్వర నాయుడు, నాయకులు హనుమంతప్ప మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఉమామహేశ్వరనాయుడు పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి తలారి సత్తి, నాయకులు ఎర్రిస్వామి, ఆనందప్ప, రామాంజనేయులు, రామచంద్రప్ప నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల పొట్ట కొడుతున్న కూటమి ప్రభుత్వం



గడ్డి తింటూ వినూత్నంగా నిరసన తెలియజేస్తున్న శ్రీరామిరెడ్డి పథకం కార్మికులు

కళ్యాణదుర్గం: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు టీడీపీ కూటమి ప్రభుత్వం పొట్ట కొడుతోందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక శ్రీరామిరెడ్డి పథకం పంపుహౌస్ వద్ద కార్మికులు చేపట్టిన నిరసన ఐదోరోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా పచ్చి గడ్డి తింటూ వినూత్న నిరసన చేపట్టారు. వేతనాల కోసం నిరవధిక సమ్మె చేస్తున్నా అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం రాలేదన్నారు. అధికారంలో ఉన్న పాలకులు నామ మాత్రంగా జీతాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడం తప్పా ఆచరణలో కనిపించడం లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి రంగనాథ్, ఎస్ఎఫ్ఐ నాయకుడు భవిత్, శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం యూనియన్ కోశాధికారి వన్నూరుస్వామి, తాలూకా అధ్యక్షుడు నరేష్, అల్లాబకాష్, చిత్తప్ప, గురుమూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



రాగులపాడులో పోసిన రామసుబ్బారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడుకు చెందిన వైఎస్సార్ సీనియర్ నాయకుడు నరసింహారెడ్డి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి గురువారం పరామర్శించారు. నరసింహారెడ్డి తండ్రి పోసిన రామసుబ్బారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కార్యక్రమంలోస ర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, మోనాలిసా, మల్లెల జగదీష్, పార్టీ ప్రధాన కార్యదర్శి మధురెడ్డి, ఉ పసర్పంచు రామాంజినేయులు, బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కొడికి గోవిందు,యువజన విభాగం నాయకుడు శశాంక్‌రెడ్డి, ఉరవకొండ కోఆర్డినేటర్ ఓబన్న, మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు ఉస్మాన్, వజ్రకరూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు రవి కాంతరెడ్డి, ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు ప్యాపిలి కిష్టప్ప, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ భరత్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రాకెట్ల బాబు, మండల టీయూసీ అధ్యక్షుడు వడ్డే లింగరాజు, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ వార్డు సభ్యుడు శివలింగ పాల్గొన్నారు. అనంతరం రాగలపాడులో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీటీసీ రామాంజనేయులును వై. విశ్వేశ్వరరెడ్డి పరామర్శించారు.

‘ఉనికి కోసం నీచ రాజకీయాలు మానుకోండి ’

కళ్యాణదుర్గం రూరల్: రాజకీయ ఉనికి కోసం నీచ రాజకీయాలు చేయడం మానుకోవాలని వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైపీ రమేష్‌పై వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణపురం వెంకటేశులు మండిపడ్డారు. గురువారం శెట్టూరు మండలంలోని యాటకల్లులో శ్రీకునే రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. కుటుంబ సభ్యులు కలిసి నిర్మించుకున్న ఆలయాన్ని రాజకీయ ఉనికి కోసం ఉపయోగించుకోవడం నీచమైన చర్య అన్నారు. వాల్మీకి రాష్ట్ర ఫెడరేషన్ డైరెక్టర్ వైపీ రమేష్, టీడీపీ నాయకులు అనంతపురం జిల్లా కేంద్రంలో మీడియా సమావేశాలు నిర్వహించి, శెట్టూరు మండలం యాటకల్లులో అన్నదమ్ములు కలిసి నిర్మించుకున్న శ్రీకునే రామలింగేశ్వర స్వామి ఆలయం అభివృద్ధి పనుల్లో, కళ్యాణ మండపం నిధుల్లో అవినీతి జరిగిందని, దేవాలయానికి రాజకీయ రంగు పులిమి నాపైనే నిందలు వేస్తూ ఊరుకునేదిలేదని హెచ్చరించారు. గతంలో ఆలయ అభివృద్ధి కోసం ఎంపీ నిధులు రూ.15 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఆలయ అభివృద్ధి పనులు తాను కాంట్రాక్టర్ కావటంతో వాటికి సంబంధించిన నిధులు రూ.8 లక్షలు తన ఖాతాలో జమ అయ్యాయని, ఇంకా బిల్లులు పడాల్సి ఉందన్నారు. నగదు జమ అయిన విషయం కమిటీకి గతంలోనే తాను తెలిపి, ఆలయ అభివృద్ధి పనులపై చర్చిద్దామని అనేక సార్లు అడిగానన్నారు. తాను అవినీతికి పాల్పడితే ఆలయ కమిటీ సభ్యుల మధ్య చర్చించి నిరూపించాలని, స్వార్థం కోసం నోటికివచ్చినట్లు మాట్లాడితే ఉరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కునే రామలింగేశ్వర స్వామి ఆలయం ఆలయ కమిటీ చైర్మన్ తిప్పేస్వామి, కమిటీ సభ్యులు రామదాసు, శెట్టూరు తిప్పేస్వామి, రాజశేఖర్ నాయకులు బిక్కి హరి, వలంటీర్ విభాగం అధ్యక్షుడు షేక్షా, యూత్ అధ్యక్షులు చరణ్, మంజు పాల్గొన్నారు.

బియ్యం వేయకపోతే కేసు నమోదు చేస్తాం

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్



ఉరవకొండ స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్

ఉరవకొండ: రేషన్ కార్డుదారులకు ప్రతి నెలా 1వ తేదీ నుంచి 17 వ తేదీ వరకు బియ్యం వేయకపోతే సంబంధిత స్టోర్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఉరవకొండ నియోజకవర్గ ప్రత్యేక అధికారి తిప్పేనాయక్ తెలిపారు. గురువారం ఉరవకొండ మార్కెట్ యార్డులోని స్టాక్ పాయింట్‌ను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లు సక్రమంగా ప్రజలకు నిత్యావసరాలు అందించాలని, లేని పక్షంలో అలాంటి డీలర్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడా కుడా ఫిర్యాదులు రాకుండా డీలర్లు జాగ్రత్త పడాలన్నారు. ఉరవకొండ స్టాక్ పాయింట్‌లో బియ్యం తదితర స్టాక్‌లు సక్రమంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్‌బాషా, స్టాక్ పాయింట్ ఇన్‌చార్జ్ చంద్రమోహన్‌రావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ వసంతబాబు

కుందుర్పి: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ వసంతబాబు తెలిపారు. గురువారం మండలంలోని ఎనుములదొడ్డి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. సమస్యలపై అందించిన ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి వివరాలు సేకరించినట్లు ఆర్డీఓ తెలిపారు. చిన్న సమస్యలను ఆర్డీఓ అక్కడి కక్కడే పరిష్కారించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ పోతన్న సిబ్బంది రైతులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

గుమ్మఘట్ట: వేసవి కాలంలో వడదెబ్బపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు రమేష్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆరోగ్య కార్యకర్తలకు ,ఆశావర్కర్లకు సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేకువజామున వ్యవసాయ, ఉపాధి పనులకు వెళ్లి మధ్యాహ్నానికి ఇళ్లకు చేరుకోవాలని తెలియజేశారు. నీరసంగా ఉన్నట్లయితే గ్లూకోజ్ నీటిని తాపాలన్నారు. అత్యవసరమైతే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మురళీధర్, సూపర్‌వైజర్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట రుణాలు రెన్యూవల్ చేయించుకోండి

కూడేరు: జల్లిపల్లి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో పంట రుణాలు తీసుకున్న రైతులు ఆయా గ్రామాలకు కేటాయించిన తేదీల్లో వచ్చి రెన్యూవల్ చేయించుకోవాలని బ్యాంక్ మేనేజర్ పెద్దన్న సూచించారు. గురువారం రెన్యూవల్ షెడ్యూల్‌ను ఆయన ప్రకటించారు. ఈ నెల 11 నుంచి 17 వరకు జల్లిపల్లి రైతులకు, 19 నుంచి 28 వరకు కొర్రకోడు, 29, 30న హంసాయ పల్లి, పీఏబీఆర్ డ్యాం, మే 2 నుంచి 8 వరకు ఉదిరిపికొండ, 9 నుంచి 14 వరకు శివరాంపేట, 15 నుంచి 17 వరకు ఉదిరిపికొండ తండా, మరుట్ల-3 కాలనీ, 19 నుంచి 22 మరుట్ల-1, 23,24న మరుట్ల-2వ కాలనీ రైతులకు రెన్యూవల్ చేస్తామని మేనేజర్ తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు ఆనుకొని ఆక్రమణలను మున్సిపల్ అధికారులు, పోలీసులు గురువారం తొలగించారు. ఇది వరకే ఆక్రమణలు తొలగింపునకు మున్సిపల్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా చర్యలు చేపట్టగా మళ్లీ షెల్టర్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు ప్రారంభించారు. ఆక్రమణలు తొలగించుకోవాలని 20 రోజుల క్రితమే నోటీసులు జారీ చేసినట్లు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ మురళీమోహన్ తెలిపారు.

ఉపాధి పనుల కల్పనలో అలసత్వం తగదు

కూడేరు: ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించడంలో అసత్వం వహించొద్దని ఏపీఓ పోలేరయ్య సిబ్బందికి ఆదేశించారు. గురువారం ఏపీఓగా పోలేరయ్య బాధ్యతలు చేపట్టిన అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం ఏపీఓ, ఇంజనీర్‌ను సిబ్బంది సన్మానించా రు. టీఏలు మంజునాథ్, జనార్దన్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఫిర్యాదు

వజ్రకరూరు: చిన్నహోతూరులో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఫ్యూజులు పోయినా అధికారులు పట్టించుకోలేదని రైతులు బసవరాజు, ముని స్వామి, సుధాకర్, నాగేంద్ర, ఓబుళప్ప తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. గు రువారం విద్యుత్ అధికారుల తీరుపై రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రైతులు మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు ఫ్యూజులు పోయిన రోజులు గడుస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు.


చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం తగదు


రాయదుర్గంటౌన్: నియోజకవర్గ పరిధిలోని నకిలీ ఆర్ఎంపీలపై చర్యలు తీసుకోవడంలో డీఎంహెచ్ఓ నిర్లక్ష్య వైఖరి తగదని బీసీవై నియోజకవర్గ అధ్యక్షుడు గౌని ప్రతాప్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో అన్నారు. ఇప్పటికే నకిలీ వైద్యుల నిర్లక్ష్యంతో ముగ్గురు పేద ప్రజల ప్రాణాలు పోయినా జిల్లా వైద్యాధికారులు పట్టించుకోలేదన్నారు. సదరు ఆర్ఎంపీలపై చర్యలు తీసుకోకపోతే అధికారులపై కేసు వేసి న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

56 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు

వజ్రకరూరు: వజ్రకరూరు మండలానికి 56 (25కేవీ)విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయినట్లు ట్రాన్స్‌కో ఏఈ ఎస్.షెక్షావలి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏఈ మాట్లాడారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి 56 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరయ్యాయని తెలిపారు.

వైభవంగా జంబుకేశ్వరస్వామి కల్యాణోత్సవం







అలంకరణలో జంబుకేశ్వరుడు, కల్యాణోత్సవం జరిపిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: స్వయంభూ జంబుకేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవాన్ని గురువారం వైభవంగా జరిపించారు. ప్రధాన అర్చకులు రామకృష్ణ, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం సాగింది. బ్రాహ్మణ సంఘం, దేవదాయశాఖ ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని జరిపారు. కల్యాణోత్సవం అనంతరం సాయంత్రం స్వామి ముత్యాల పల్లకీ ఉత్సవం నిర్వహించారు. స్వామిని ముత్యాల పల్లకీలో పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఆలయం వద్ద ప్రారంభమైన ఊరేగింపు కోట, వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డు, నేసేపేట వరకూ కొనసాగింది. శుక్రవారం స్వామి గజేంద్రవాహనోత్సవం జరుగుతుందని దేవదాయశాఖ ఈఓ కె.నరసింహారెడ్డి తెలిపారు.

మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం





ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న దృశ్యం ,గణపతి పూజ చేస్తున్న అర్చకులు

ఉరవకొండ: పట్టణంలో ప్రసిద్ధిగాంచిన మల్లేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యా యి. ఉదయం స్వామికి సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, గంగపూజ, యాగశాల ప్రవేశం, గణపతి పూజ చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు అంకుర్పారణ చేస్తూ ఆలయ అర్చకులు ధ్వజారోహణ అంకుర్పారణ మండపరాధన, మంగళహారతి పూజలు చేశారు. అనంతరం స్వామి తీర్థప్రసాదాలను భక్తులకు అందించారు. భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం శుక్రవారం జరగనుంది. బసవేశ్వరస్వామి వాహనంపై భక్తులకు స్వామివారు దర్శనమివ్వనున్నారు.

శుభకార్యం



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తదితరులు

వజ్రకరూరు: మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఎద్దాటి వెంకటేష్, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు ఎద్దాటి నందకుమార్, అనంతపురానికి చెందిన ఐశ్వర్య వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి గురువారం హాజరై, వధూవరులను ఆశీర్వదించారు.

ఘనంగా సరస్వతీ పూజ



సరస్వతీపూజలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 21వ వార్డు పరిధిలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం సరస్వతీ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం ఎన్.రవి కుమార్‌నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంఈఓ నాగమణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని సరస్వతీదేవి చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల సీనియర్ టీచర్ సోమేశ్వరంరెడ్డి, పాఠశాల చైర్మన్ లక్ష్మీ, కమిటీ సభ్యులు ప్రదీప్, నాగరాజు పాల్గొన్నారు.

అర్జీలన్నీ పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న విప్ కాలవ

రాయదుర్గం: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీకీ తప్పక పరిష్కారం చూపే బాధ్యత అధికారులు తీసుకోవాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ కొండన్న లతో కలసి విప్ కాలవ ప్రజా వినతులు స్వీకరించారు. సమస్యలు పరిష్కారం కోరుతూ వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలించి అర్జీలు సమర్పించి వెళ్లారు. కార్యక్రమంలో ఆయా శాఖల మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాఘవేంద్రస్వామికి పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయం, రాఘవేంద్రస్వామి ఆలయాల్లో గురువారం భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సాయి ఆలయంలో స్వామికి మంగళహారతి, అర్చనలు జరిపారు. కోటలో వెలసిన రాఘవేంద్రస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజ చేశారు.

650 చీనీ మొక్కలు నరికివేత

కూడేరు: పి.నారాయణపురానికి చెందిన రైతు సాయి కృష్ణకు చెందిన పొలంలోని 650 చీనీ మొక్కలను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. 15 రోజులు క్రితం 650 చీనీ మొక్కలను పొలంలో సాగు చేసినట్లు బాధిత రైతు తెలిపాడు. ఈ మేరకు బాధిత రైతు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



గ్యారేజీ గేటు ముందు నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

రాయదుర్గంటౌన్: ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు డిమాండ్లు పరిష్కరించాలని గురువారం ధర్నా చేశారు. ఎన్ఎంయూఏ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగరాజు, జోనల్ ఉపాధ్యక్షుడు ఎండీ షఫీ, డిపో కార్యదర్శి తిప్పేస్వామి మాట్లాడారు. ఉద్యోగ భద్రత సర్క్యులర్ 1/19 యధావిధిగా అమలు చేయాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని అమలు చేయాలని, మెడికల్ లీవ్ కమిటేషన్ ఇచ్చి ప్రతినెలా జీతం ఇవ్వాలని, మహిళా కండక్టర్లు, గ్యారేజీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దామోదర్, రవినాయక్, జిలాన్, దూద్ పీరా, సతీష్‌కుమార్, యోగేంద్ర, నఫీస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కళ్యాణదుర్గం రూరల్: కూటమి ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆర్టీసీ డిపో అధ్యక్షుడు వెంకటస్వామి, డిపో సెక్రటరీ ఈరన్న అన్నా రు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ ఉద్యోగులు ధర్నా చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు మాట్లాడుతూ 1-2019 సర్క్యులర్‌ను ఇంప్లిమెంట్ చేయాలని, అక్రమ సస్పెన్షన్లు ఎత్తేయాలని కోరారు. గ్యారేజ్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, డ్రైవర్, కండక్టర్ల నైట్ జౌట్ అలవెన్సులు పెంచాలని కోరారు.